## మినీకథ

# మే ఐ హెల్ప్ యు

—ఆర్వీ రమణ ప్రసాద్

"అయ్యా డాక్టర్ వేదాంతం గారంటే..."

"ఆ....ఆ ... నేనే వేదాంతాన్ని....ఆలా కుర్చీలో కూర్చోండి...అయ్యయ్యో కుర్చీలో కూర్చోమంటే వాష్ బేసిన్‌లో కూర్చుంటున్నారేమిటండీ..ఇలా రండి... ఆ...యిదీ కుర్చీ....యిప్పుడు కూర్చుని మీ కేసేమిటో చెప్పండి."

"హమ్మయ్య ...చూస్తున్నారు కదా డాక్టరుగారూ ...యిదే నా కేసు.... ఒక ఏడాదై వుంటుందండి .... నాకంటి చూపు మందగించి ...అప్పణ్ణించి యిలానే వుందండి నా పరిస్థితి ...మీ నేమ్ బోర్డు చదవడానికే గంటసేపు పట్టిందంటే నమ్మండి... ఇక మిగిలిన విషయాలు వింటే మీరు మరింత సానుభూతితో నా పరిస్థితి అర్థం చేసుకోగలరండి... అసలు నాకు దృష్టిదోషం వుందన్న సంగతి చాల చిత్రమయిన పరిస్థితులలో తెలిసిందండి ... చెప్తావినండి.... ఒకనాడాఫీసు విడిచిపెట్టేక యింటికి బయల్దేరానండి.ఇంకా పూర్తిగా చీకటి కూడా పడలేదండి ... మా సందు మలుపు తిరగ్గానే ఒకావిడ ఎర్రచీర కట్టుకుని వెళ్తూ కనబడిందండి ...మీతో చెప్పటేం ... మా ఆవిడ కూడా ఎర్రచీరలంటే చాల యిష్టమండి. ఆ ఎర్రచీర కట్టుకున్నది మా ఆవిడే కాబోలనుకుని గభాలున వెళ్ళి భుజంమీద చెయ్యేసేనండి....అంతే! ఆవిడ కొట్టిన దెబ్బకి ఒక పక్క దవడ పళ్ళన్నీ కదలిపోయాయంటే నమ్మండి. దానికితోడు ఆవిడలా కొట్టడం ఇంట్లోంచి మాఆవిడ కూడ చూసిందట. ఇంటికిరాగానే రెండోపక్క దవడ కూడ-ఊ.... ఎందుకులెండి చెప్పుకుందికి సిగ్గుచేటు. ఇది జరిగిన నాల్రోజులనాడే కుర్చీలోకూర్చుని పేపరు చదువుకుంటున్నానండి ... ఎవరో పాకుతూ వచ్చి కాలు గోకడం మొదలుపెట్టారండి . మాచంటాడు కాబోలనుకుని చటుక్కున ఎత్తుకుని మూతిమీద గట్టిగా ముద్దుపెట్టుకున్నానండి . కాని తీరా చూస్తే అది మా పెంపుడు కుక్కపిల్ల టామీ అండి! ఛీఛీ మూడ్రోజులు డెట్టాలేసి నోరంతా కడుక్కున్నానంటే నమ్మండి ..."

"కాస్త ఆగుతారా...."

"ఉండండి.... పూర్తిగా చెప్పనీయండి. నా కేసు పూర్తిగా వింటేగాని దీనివల్ల యింకా ఎన్ని బాధలున్నాయో మీకర్థం కాదండి.నాకు చూపుమందగించిందని తెలిసి యింట్లోవాళ్ళు బయటివాళ్ళు చేస్తున్న ఆగడాలు అన్నీ యిన్నీ కావండి! ఓ నాడు మా బావ మర్దొచ్చి "ఇది చాలా మంచి ఫారిన్ సిగరెట్టూ....కాల్చు బావా" అంటూ ఓ సిగరెట్టిచ్చేడండి....సరేనని దాని నోట్లో పెట్టుకుని వెలిగించానండి ఇంతలో వచ్చిందండి మా ఆవిడ ఎక్కణ్ణించో....వస్తూనే "సిగరెట్ స్మోకింగ్ యీజ్ యింజూరియస్ టు హెల్తూ" అంటూ దాన్ని నా నోట్లోంచి లాగి విసిరేసిందండి. అలా విసిరేయబట్టే బతికిపోయానండి. లేకపోతే మా బావమర్ది పుణ్యమా అని పుణ్యలోకాలకెళ్ళిపోయుండేవాణ్ణండి....ఎందుకో తెలుసాండీ ... అతగాడిచ్చింది సిగరెట్ కాదటండి....సీమటపాకాయటండి! చూశారా........ఎంత.... ...



ప్రమాదం తప్పిందో....ప్...

కాని ఏం లాభం. యింట్లో ప్రమాదం నించి తప్పించుకున్నాను. కాని ఆఫీసులో యింతకంటె ఘోరమైన ప్రమాదం నించి తప్పించుకోలేకపోయానండి.... అసలిదంతా మా ఆఫీసువాళ్ళు నన్నేడిపించాలని వేసిన ప్లానులెండి. ఆ సంఘటన తలుచుకుంటుంటేనే వణుకు పుడుతుందండి "

"ఇంతకీ...."

"ఏం జరిగిందో చెప్పమంటారా....అదే చెప్తున్నా— ఈ మధ్యే జరిగిందండి. మా కంపెనీ ఛైర్మన్ రాకరాక మా ఆఫీసుని విజిట్ చెయ్యడానికొచ్చేడండి. చాలా కాలం తర్వాత వచ్చేడు కదాని మా ఆఫీస్ స్టాఫంతా కలిసి అతని గౌరవార్థం చిన్న ఫంక్షను ఏర్పాటు చేశారండి....ఆ ఫంక్షనులో అతనికి పూలమాలేసి స్వాగతం చెప్పమని నే వద్దంటున్నా వినకుండా నన్ను పురిగొల్పారండి.... ఆ కంగారులో నేనా దండ ఆయనకి వెయ్యడానికి బదులు పక్కనేవున్న ఆయన రెండో భార్య మెళ్ళో వేసేశానటండి ... అదండి జరిగింది.... ఆ తర్వాతాయన చేసిన గొడవకి నా ఉద్యోగం ఊడినంత పనైందండి చివరికెలాగో ఆ ఛైర్మన్‌గారి కాళ్ళమీద పడి వేడుకునీ, మొత్తుకునీ ఉద్యోగం నిలబెట్టుకున్నానండి.... చూశారాండీ.... దీనివల్ల ఎన్ని ప్రమాదాలో...."

"కాని.... అసలు సంగతి...."

"ఆ ... అదే.... అసలు సంగతికే వస్తున్నానండి . ఈ బాధలన్నీ భరించలేక యివాళెలాగైనా 'ఐ' స్పెషలిస్టుని సంప్రదించి వెంటనే ఆపరేషను చేయించుకుందామని బయల్దేరానండి....నా అదృష్టం బావుండి ఆడబోయిన తీర్థం ఎదురైనట్టూ, వెతకబోయిన తీగ కాళ్ళకి చుట్టుకున్నట్టూ మీ యింటి ముందుకి రాగానే పెద్ద రెడ్ క్రాస్ గుర్తు మసగ్గా కనిపించిందండి.... ఇదేదో డాక్టరుగారిల్లే అయ్యుంటుంది.... బహుశా నాలాంటి వాళ్ళకి బాగా కనపడాలని పెద్ద బోర్డు రాయించి వుంటారనుకుంటూ లోపలికొచ్చి మీ నేమ్ బోర్డు చూశానండి....ఆహా!.... నా ఆనందానికి అవధుల్లేవంటే నమ్మండి. 'డాక్టరు వేదాంతం కంటి డాక్టరు' అని చక్కని తెలుగులో అందమైన అక్షరాల్తో రాయించారండి బోర్డుని....యిక ఫర్వాలేదండి ... యివాళనించి నా బాధ్యతంతా మీదేనండి... మీ ఫీజెంతైనా ఫర్వాలేదండి....ఆపరేషను మాత్రం వెంటనే చేసెయ్యాలండి.... ఏమంటారండి ...."

"...............…"

"డాక్టరుగారూ"

"ఊ"

"మాట్లాడరేమిటండీ?"

"మీ ధోరణే కాని అసలు నన్ను మాట్లాడనిస్తేనా?"

"భలే జోకేశారండి .... నేనంత వాగుడు కాయననా మీ ఉద్దేశం! పోనీ అలానే అనుకోండి- కాని ఆపరేషను ఎప్పుడు చేస్తారో చెప్పండి చాలు."

"అబ్బబ్బా .... నేను కంటి డాక్టరుని కాదయ్యా బాబూ ... పంటి డాక్టరుని.... యిందాకట్నించి చెప్దామనుకుంటున్నా నువ్వా విషయం చెప్పనిస్తేనా?"

"ఆ!!"

●